క్లుప్తంగా

మొక్కు తీర్చుకొన్న ఒగ్గు మల్లయ్య



మొక్కు చెల్లించుకొన్న మల్లయ్య

మోమిన్‌పేట: రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రిగా, గడ్డం ప్రసాద్ ఎమ్మెల్యేగా ఎన్నిక కావడంతో మాజీ ఎంపీపీ ఒగ్గు మల్లయ్య, మెదక్ జిల్లా ఏడుపాయలలో అమ్మవారికి మొక్కు తీర్చుకున్నారు. గురువారం రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకార సమయంలోనే అమ్మవారిని దర్శించుకొని మొక్కు తీర్చుకున్నామని ఆయన తెలిపారు. రాష్ట్రంలో సుపరిపాలన అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మల్లారెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, నర్సింహారెడ్డి తదితరులు ఉన్నారు.

వంటగ్యాస్ ఈకేవైసీ చేసుకోండి

దౌల్తాబాద్: వంటగ్యాస్ వినియోగదారులు ఈకేవైసీ నమోదు చేసుకోవాలని దౌల్తాబాద్ ఇండియన్ గ్యాస్ ఏజెన్సీ మేనేజర్ శ్రీనివాస్ తెలిపారు. వినియోగదారులు ఆధార్‌కార్డు, వంటగ్యాస్ సరఫరాకు సంబంధించిన పుస్తకాన్ని తీసుకొచ్చి ఈకేవైసీ చేయించుకోవాలని సూచించారు. ఈకేవైసీకి రాష్ట్ర ప్రభుత్వ రాయితీకి ఎలాంటి సంబంధం లేదని, ఎలాంటి అనుమానాలు లేకుండా ఈకేవైసీ చేయించుకోవాలని సూచించారు.

రేవంత్‌కు శుభాకాంక్షలు



జైపాల్‌రెడ్డి (ఫైల్)

తాండూరు టౌన్: ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన రేవంత్‌రెడ్డికి అతిథి అధ్యాపకుల సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జైపాల్‌రెడ్డి, జనార్దన్ గురువారం ఓ ప్రకటనలో శుభాకాంక్షలు తెలిపారు. అధ్యాపకులకు సంబంధించిన వేతనాల పెంపు, ఆటో రెన్యువల్‌తో పాటు పలు సమస్యలను పరిష్కరిస్తానని కాంగ్రెస్ మేనిఫెస్టోలో ప్రకటించారని గుర్తుచేశారు. తమ సమస్యలను త్వరలో పరిష్కరిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

కొందుర్గు: జిల్లేడ్ చౌదరిగూడ మండలపరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఉదయం 11 గంటలకు ఎంపీపీ యాదమ్మ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ మహేష్‌బాబు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి మండల స్థాయి అన్ని శాఖల అధికారులు తమ ప్రగతి నివేదికలతో హాజరుకావాలని సూచించారు.

కాంగ్రెస్ మాట ఇస్తే తప్పదు

- పాబాద్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కావలి చంద్రశేఖర్

షాబాద్: కాంగ్రెస్ మాట ఇస్తే తప్పదని సీఎం ఎనుముల రేవంత్‌రెడ్డి ఆరు గ్యారంటీ పథకాలపై సంతకాలు చేయడంతో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కావలి చంద్రశేఖర్ పేర్కొన్నారు. గురువారం షాబాద్ మండల పరిధిలోని హైతాబాద్ గ్రామంలో సీఎం రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా మహిళలకు స్వీట్లు పంచిపెట్టి సంబురాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే తెలంగాణ ప్రజలకు మంచి రోజులు వచ్చాయన్నారు. రాష్ట్రంలో నియంత పాలన పోయి బడుగు, బలహీన వర్గాల ప్రభుత్వం వచ్చిందన్నారు. ఇచ్చిన మాట ప్రకారం ఆరు గ్యారంటీలను తమ ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీలు కుమ్మరి చెన్నయ్య, పొన్న జయమ్మ, వెంకట్‌రెడ్డి, హైతాబాద్ ఉపసర్పంచ్ చంద్రారెడ్డి, అత్తిల్లి శ్రీనివాస్‌రెడ్డి, సుభాశ్‌రెడ్డి, శ్రీరాంరెడ్డి, పోచయ్య, రవి, ముబీన్, నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

మొదటి ఉద్యోగంపై హర్షం

షాబాద్: వికలాంగురాలికి మొదటి ఉద్యోగం ఇవ్వడం సంతోషకరమని హక్కుల జాతీయ వేదిక జిల్లా కోశాధికారి దేవరంపల్లి రాజశేఖర్‌గౌడ్ పేర్కొన్నారు. గురువారం షాబాద్ మండలం కేంద్రంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో నూతనంగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వానికి, రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ఆయన అభినందనలు తెలిపారు. గత ప్రభుత్వాల మాదిరిగా కాకుండా వికలాంగుల సంక్షేమానికి కృషి చేయాలని ఆయన పేర్కొన్నారు. గడిచిన 10 సంవత్సరాల కాలంలో రాష్ట్రంలో వికలాంగుల సంక్షేమానికి గత ప్రభుత్వం ఏనాడు పట్టించుకోలేదని దుయ్యబట్టారు. పెన్షన్ మాత్రమే ఇచ్చి విద్య, ఉపాధి వంటి మౌలిక అంశాలను దూరం చేసిందని విమర్శించారు. ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన అంశాలను ఈ ప్రభుత్వం అమలు చేయాలని ఆయన కోరారు. ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న బ్యాక్‌లాగ్ పోస్టులను భర్తీ చేయాలని విన్నవించారు. పెన్షన్ రూ. 6వేలకు పెంచుతామనే హామీని ఎలాంటి షరతులు లేకుండా అమలు చేయాలని పేర్కొన్నారు. వికలాంగురాలు రజినికి కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఉద్యోగం ఇస్తామని ఇచ్చిన హామీని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిలబెట్టుకోవడం సంతోషకరమన్నారు.

కల్వర్టుకు మోక్షమెన్నడో?

- రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు
- తరుచూ ప్రమాదాలు
- బెంబేలెత్తున్న వాహనదారులు
- ఏడాదైనా పట్టించుకోని పాలకులు, అధికారులు



వర్షాలకు దెబ్బతిన్న బాసపల్లి, గొడుగోనిపల్లి కల్వర్టు

దోమ: వర్షాల ధాటికి ఏడాది క్రితం మహబూబ్‌నగర్ ప్రధాన రహదారిపై కూలిన కల్వర్టుకు నేటికీ మోక్షం లభించలేదు. వర్షం వచ్చిందంటే చాలు ఈ కల్వర్టు దాటేందుకు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు అవస్థలు పడుతున్నారు. అయినా పాలకులు, అధికారులు మరమ్మతులపై శ్రద్ధ పట్టడం లేదు. ప్రతిరోజు వందలాది మంది ప్రయాణికులు ఈ రహదారిపై రాకపోకలు సాగిస్తున్నారు.

ఏ క్షణంలో ఏం జరుగుతుందోననే భయంతో వణికిపోతున్నారు. గత ఏడాదిలో కురిసిన భారీ వర్షాలకు మండల పరిధిలోని బాసుపల్లి, గొడుగోనిపల్లి గ్రామ సమీపంలోని పరిగి, మహబూబ్‌నగర్ ప్రధాన రహదారిపై ఉన్న కల్వర్టు వర్షాలకు ధ్వంసమైంది. సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినా.. పట్టించుకోలేదని ఆయా గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు.

ముందుకు సాగని పనులు

ధ్వంసమైన కల్వర్టును జెడ్పీటీసీ నాగిరెడ్డి, వైస్ ఎంపీపీ మల్లేశం గతంలో పరిశీలించారు. మండల సర్వసభ్య సమావేశంలో కూడా కల్వర్టు మరమ్మతులపై చర్చించారు. అధికారులు వెంటనే మరమ్మతులు చేయాలని ఆదేశించారు. అయినా అధికారుల్లో ఏ మాత్రం చలనం రాలేదు. పరిగి నుంచి మహబూబ్‌నగర్ వెళ్లే ప్రధాన రహదారి కావడంతో నిత్యం రద్దీగా ఉంటుంది. ఈ రోడ్డుపై అనేక సార్లు ప్రమాదాలు కూడా జరిగాయి. అయినా ఎక్కడ వేసిన గొంగడి అక్కడే ఉన్నట్లు కల్వర్టు నిర్మాణ పనులు ఏమాత్రం ముందుకు సాగడం లేదు. దీంతో ప్రజలు, వాహనదారులు మండిపడుతున్నారు. బాసుపల్లి, గొడుగోనిపల్లి గ్రామ సమీపంలోని కల్వర్టుతో పాటు రోడ్డు కూడా ధ్వంసమైంది. భారీ వర్షం కురిస్తే కల్వర్టు తెగిపోయే ప్రమాదం ఉందని ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు నిర్లక్ష్యాన్ని వీడి మరమ్మతులు చేయాలని గంపెడాశతో ఎదురు చేస్తున్నారు.

పట్టించుకోని అధికారులు



కల్వర్టు తెగి ఏడాది దాటినా అధికారులు మరమ్మతులు చేయడం లేదు. ఎన్నో సార్లు ఫిర్యాదు చేశాం. అయినా పట్టించుకోలేదు. ఈ రోడ్డుపై అనేక సార్లు ప్రమాదాలు జరిగాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు కల్వర్టు పనులను త్వరగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలి.

– శ్రీనివాస్, దొర్నాల్‌పల్లి

మెథడిస్టు జాతరలో భక్తుల కోలాహలం



యేసుక్రీస్తు శిలువ వద్ద ప్రార్థన చేస్తున్న భక్తులు

ధారూరు: ధారూరు క్రిస్టియన్ మెథడిస్టు జాతర ఉత్సవాలు గురువారానికి మూడోరోజుకు చేరుకున్నాయి. ఈ జాతరకు లక్షలాది మంది క్రైస్తవ భక్తులు హాజరై.. యేసు ప్రభువు శిలువ వద్ద ప్రార్థనలు చేశారు. జాతరకు తెలంగాణ నుంచే కాకుండా ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్ర, తమిళనాడుతో పాటు విదేశాల నుంచి భక్తులు తరలివస్తారు. ఇక్కడ వెలిసిన యేసుక్రీస్తు తమ కోర్కెలు తీరుస్తారని భక్తులు విశ్వసిస్తారు. భక్తులు, వినియోగదారులతో జాతర ప్రాంగణమంతా సందడిగా మారింది. ఇక్కడ బైబిళ్లు, యేసు ప్రభువు చిత్రపటాలు, బ్యానర్లు, ఫొటోలను విక్రయిస్తున్నారు. తెలుగు, హిందీ, కన్నడ, ఇంగ్లీష్ భాషల్లో రచించిన యేసు సాహిత్యాన్ని భక్తులు కొనుగోలు చేస్తున్నారు. ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సీఐ రామకృష్ణ ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహిస్తున్నారు. ఈ నెల 10 వరకు ఉత్సవాలు కొనసాగుతాయి. ప్రతి ఏడాది నవంబర్‌లో జరిగే ఈ జాతర అసెంబ్లీ ఎన్నికల కారణంగా డిసెంబర్ 5 నుంచి ప్రారంభించారు.

ప్రసాద్‌కుమార్ ఎంపికపై హర్షం



కొబ్బరికాయలు కొడుతున్న సుభాష్ తదితరులు

మోమిన్‌పేట: వికారాబాద్ ఎమ్మెల్యే గడ్డం ప్రసాద్‌కుమార్‌ను శాసనసభ స్పీకర్‌గా ఎన్నుకోవడంతో కాంగ్రెస్ నాయకుడు సిరాజుద్దీన్ హర్షం వ్యక్తం చేశారు. గురువారం ఆయన మండల కేంద్రంలో మాట్లాడుతూ ప్రసాద్‌కుమార్‌కు సముచిత స్థానం కల్పించినందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు లక్ష్మారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, సురేందర్, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

మర్పల్లి: వికారాబాద్ ఎమ్మెల్యేగా గడ్డం ప్రసాద్‌కుమార్ గెలుపొందడంతో కాంగ్రెస్ నాయకులు మొక్కులు చెల్లించుకున్నారు. కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు గూడెపు సుభాశ్‌యాదవ్, ఏఎంసీ వైస్ చైర్మన్ రామేశ్వర్‌తో పాటు పలువురు గురువారం మర్పల్లి హనుమాన్ ఆలయంలో 101 కొబ్బరి కాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. శాసనసభ స్పీకర్‌గా ప్రసాద్‌కుమార్‌ను ఎన్నుకోవడంపై హర్షం వ్యక్తం చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రివర్గానికి ఈ సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు దివాకర్, నర్సింగ్ యాదవ్, శేఖర్ యాదవ్, మల్లేశ్ యాదవ్, మాజీ సర్పంచ్ పాండునాయక్ తదితరులు పాల్గొన్నారు.

బంట్వారం: తెలంగాణ అసెంబ్లీ స్పీకర్‌గా వికారాబాద్ ఎమ్మెల్యే గడ్డం ప్రసాద్‌కుమార్‌ను నియమించడంపై బంట్వారం మాజీ సర్పంచ్ జంగం చంద్రకళ, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు స్వామి గురువారం ఓ ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. అసెంబ్లీ స్పీకర్‌గా ప్రసాద్‌కుమార్‌ను నియమించి గౌరవించారని పేర్కొన్నారు.

రైతులు జాగ్రత్తలు తీసుకోవాలి

మండల వ్యవసాయాధికారి వెంకటేశం



మల్లారెడ్డిగూడలో నారుమడి (ఫైల్)

షాబాద్: రబీలో బోరుబావుల కింద వరి సాగు చేసే రైతులు తగు జాగ్రత్తలు తీసుకుంటే ఆశించిన స్థాయిలో పంట దిగుబడి వస్తుందని షాబాద్ మండల వ్యవసాయాధికారి వెంకటేశం సూచించారు.

ఇలా చేయండి..

- నారుమడి 10–12 రోజుల వ్యవధిలో ఉన్నప్పుడు మూడు దఫాలుగా దమ్ము చేసి చదును చేయాలి. నీరు పెట్టడానికి, తీయడానికి వీలుగా కాలువలను ఏర్పాటు చేసుకోవాలి.
- ఐదు సెంట్ల నారుమడికి రెండు కిలోల నత్రజని, ఒక కిలో భాస్వరం, ఒక కిలో పోటాష్, ఎరువులను దుక్కిలో వేయాలి. చలి ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో భాస్వరం రెట్టింపు వేయాలి.
- మొలక కట్టిన విత్తనాన్ని సెంటుకు ఐదు కిలోల చొప్పున చల్లుకోవాలి.
- నారు, ఒక ఆకు పూర్తిగా పురివిచ్చుకునే వరకు ఆరు తడులు ఇచ్చి తరువాత పలుచగా నీరు కట్టాలి.
- జింకు లోపాన్ని గమనిస్తే లీటర్ నీటికి రెండు గ్రాముల జింకు సల్ఫేట్ ద్రావణాన్ని పిచికారి చేయాలి. చలి ఎక్కువగా ఉండే సమయంలో వరిసాగులో జింకు లోపం లక్షణాలు ప్రస్ఫుటంగా కనిపిస్తాయి.
- విత్తిన పది రోజులకు కార్బోఫ్యూరాన్ 3జీ గుళికలు ఎంటు నారుమడికి 160 గ్రాముల చొప్పున వేయాలి. లేదా మోనోక్రొటోఫాస్ 1.6 మిల్లీలీటర్లు, లేదా క్లోరిపైరిపాస్ 2.0 మిల్లీలీటరును లీటర్ నీటిలో కలిపి విత్తిన పది రోజులు, 17 రోజులకు పిచికారి చేయాలి.
- నారు తీయడానికి ఏడు రోజుల ముందు సెంటు మడికి 160 గ్రాముల కార్బోఫ్యూరాన్ గుళికలు తక్కువ నీటిలో వేయాలి.

చర్చ జరిగేనా..?

- నేడు మొయినాబాద్ సర్వసభ్య సమావేశం
- సర్పంచ్‌లకు ఇది చివరిది
- సమస్యలకు పరిష్కారం దొరికేనా?



మొయినాబాద్ మండల పరిషత్ కార్యాలయం

మొయినాబాద్: మండలంలో నెలకొన్న సమస్యలపై చర్చించి అధికారులతో వాటి పరిష్కారానికి దిక్సూచిగా నిలిచే మండల సర్వ సభ్య సమావేశం ఈ సారైనా సమగ్రంగా సాగుతుందా? అనే అనుమానాలను పలువురు లేవనెత్తుతున్నారు. శుక్రవారం మొయినాబాద్ మండల సర్వసభ్య సమావేశం జరుగనుంది. రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం ఏర్పడిన తరువాత ఈ సమావేశానికి ప్రాధాన్యత సంతరించుకుంది. ప్రతీసారి జరిగే సమావేశాలు మొక్కుబడిగానే సాగుతున్నాయి. ఎజెండాలోని అంశాలపై సమగ్రంగా చర్చించకుండా అధికారులు చదవడం..సభ్యులు వినడమేతంతుగా మారింది. విద్యుత్ శాఖపై చర్చ జరిగినప్పుడు మాత్రమే సర్పంచ్‌లు, ఎంపీటీసీలు తమ గ్రామాల్లోని సమస్యలను సభ దృష్టికి తెచ్చేవారు. మిగతా శాఖలకు సంబంధించిన అంశాలపై చర్చ జరిగేటప్పుడు సభ్యులెవరూ పెద్దగా స్పందించడంలేదు. అయితే ఈ సారి కొత్త ప్రభుత్వం ఏర్పడడంతో సమస్యలపై చర్చ ఎలా జరుగుతుందనేదానిపై ఆసక్తి నెలకొంది.

మీసేవ కేంద్రంపై..

మొయినాబాద్ మండలంలో ఒకటే మీ సేవ కేంద్రం ఉండడంతో మండల ప్రజలు, రైతులు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గత మూడేళ్లగా ఒకే ఒకటి మీసేవ కేంద్రం రెడ్డిపల్లిలో నడుస్తుంది. మొయినాబాద్ మీసేవను ప్రభుత్వం సీజ్ చేయగా, హిమాయత్‌నగర్ మీసేవ కేంద్ర నిర్వాహకుడు మృతి చెందడంతో రెండు కేంద్రాలు మూతపడ్డాయి. దీంతో రెడ్డిపల్లిలో ఒకటే ఉండడంతో మండల ప్రజలు అక్కడికే వెళ్లాల్సి వస్తుంది. దీంతో అది వారికి దూరభారంగా మారడమే కాకుండా వారు విలువైన సమయం కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

గ్రామీణ రోడ్ల పరిస్థితి...

మండలంలోని చాలా గ్రామాలకు వెళ్లే ప్రధాన రోడ్లు తీవ్రంగా దెబ్బతిన్నాయి. గత మూడేళ్లగా వర్షాలు అధికంగా కురుస్తుండడంతో అప్పటి నుంచి రోడ్లన్ని గుంతల మయంగా మారాయి. కొన్ని గ్రామాల్లో రోడ్ల అభివృద్ధికి నిధులు మంజూరయ్యాయని అసెంబ్లీ ఎన్నికలకు ముందు శంకుస్థాపనలు చేశారు. కానీ ఒక్క పనికూడా మొదలు కాలేదు. ఇప్పుడు ప్రభుత్వం మారడంతో రోడ్ల అభివృద్ధి పనులు ఎప్పుడు మొదలు పెడతారోనని ప్రజలు ఎదురుచూస్తున్నారు. కొన్ని గ్రామాల రోడ్లకు నిధులు మంజూరు కాలేదు. వాటిపై సభ్యులు ఏం చర్చిస్తారో చూడాలి. వీటితోపాటు గ్రామాల్లో పారిశుధ్యం, సీజనల్ వ్యాధులు, ప్రభుత్వ పాఠశాలల్లో నెలకొన్న సమస్యలపై సర్వసభ్య సమావేశంలో సమగ్ర చర్చ జరగాలని ప్రజలు కోరుతున్నారు. సర్పంచ్‌ల పదవికాలం 2024, ఫిబ్రవరి 1తో ముగియనుంది. కాబట్టి ఇదే వారికి చివరి సర్వసభ్య సమావేశం అవుతుందని వారు భావిస్తున్నారు. ఈ సమావేశంలో సర్పంచ్‌లు తమ తమ సమస్యలపై ఏమేరకు చర్చిస్తారో చూడాలి.

కదిలిన కాంగ్రెస్ దండు



కుల్కచర్ల నుంచి సీఎం ప్రమాణ స్వీకారానికి బయల్దేరిన నేతలు

పరిగి: సీఎంగా రేవంత్‌రెడ్డి ప్రమాణస్వీకారం చేస్తుండటంతో గురువారం మండలం నుంచి కాంగ్రెస్ పార్టీ నాయకులు భారీగా తరలివెళ్లారు. ఈ సందర్భంగా మండల కాంగ్రెస్ అధ్యక్షుడు పరశురాంరెడ్డి మాట్లాడుతూ ఇక నుంచి ప్రజా పరిపాలన కొనసాగుతుందన్నారు. గతంలో నియంత పాలనలో ప్రజలు ఎన్నో ఇబ్బందులు పడ్డారని, నేడు ప్రజలు కోరుకునే కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరబోతుందన్నారు. ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయగానే హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తామని తెలిపారు. రేవంత్ ముఖ్యమంత్రి కావడంతో జిల్లాకు ఎంతో పేరు ప్రతిష్టలు వచ్చాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో హన్మంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీఎం ప్రమాణస్వీకారానికి నాయకులు

కుల్కచర్ల: రేవంత్‌రెడ్డి ప్రమాణ స్వీకారానికి మండల కాంగ్రెస్ నేతలు పెద్ద ఎత్తున గురువారం బయల్దేరారు. హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో జరుగుతున్న ఈ కార్యక్రమానికి ఆయా గ్రామాల సర్పంచ్‌లు, కార్యకర్తలు, పెద్ద సంఖ్యలో పయనమయ్యారు. జిల్లాకు సబంధించిన వ్యక్తి సీఎంగా ప్రమాణం చేయడం సంతోషంగా ఉందని కాంగ్రెస్ నేతలు చెబుతున్నారు. పరిగి, వికారాబాద్, కొడంగల్, తాండూర్ నియోజకవర్గాలు మరో సిద్దిపేట, సిరిసిల్ల, గజ్వేల్‌లా అభివృద్ధి చెందుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు స్వామి, వెంకటేశ్, కృష్ణయ్య, వెంకటేశ్‌గౌడ్, వినోద్, శ్రీనివాస్, బాలకృష్ణ, బాబు, రవి, సత్యం, బాలయ్య, మైబెల్లి, శ్రీను, భాను, మురళి, గణేశ్ పాల్గొన్నారు.



సీఎం ప్రమాణస్వీకారానికి బయలుదేరిన నాయకులు

కరన్‌కోట్‌లో సంబురాలు

తాండూరు రూరల్: ముఖ్యమంత్రిగా రేవంత్‌రెడ్డి ప్రమాణ స్వీకారం చేయడంతో కరన్‌కోట్ గ్రామంలో కాంగ్రెస్ శ్రేణులు సంబురాలు జరుపుకున్నారు. గురువారం గ్రామ చౌరస్తాలో బాణసంచా కాల్చారు. అనంతరం స్వీట్లు పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో సుధాకర్, రాజు, సునీల్, ధనుశ్, వినోద్, ఆంజనేయులు ఉన్నారు.

రేవంత్ నాయకత్వంలో ముందుకెళ్తాం

దౌల్తాబాద్: సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ముందుకెళ్తామని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వెంకట్రావు అన్నారు. గురువారం రేవంత్‌రెడ్డి ప్రమాణ స్వీకారోత్సవానికి మండలం నుంచి కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు తరలివెళ్లారు. కార్యక్రమంలో వెంకట్‌రెడ్డి, వీరన్న తదితరులున్నారు.

అందుబాటులోకి మార్కెట్..



అవగాహన కల్పిస్తున్న వెంకటరంగారెడ్డి

చేవెళ్ల: రైతులు పండించిన కూరగాయలను సాయంత్రం మార్కెట్‌లో అమ్ముకునే విధంగా మార్కెట్‌ను అందుబాటులోకి తీసుక రాబోతున్నట్లు చేవెళ్ల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ మిట్ట వెంకటరంగారెడ్డి తెలిపారు. చేవెళ్ల మండలంలోని పామెన గ్రామంలో గురువారం స్థానిక ప్రజాప్రతినిధులు, రైతులతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు మార్కెటింగ్ సౌకర్యం మరింత అందుబాటులో తీసుకు రావాలనే ఉద్దేశ్యంతో ఉదయం, సాయంత్రం రెండుపూటల మార్కెట్ నిర్వహించేవిధంగా తగిన ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. ఇప్పటికే చేవెళ్ల మార్కెట్ యార్డులో ప్రతిరోజు ఉదయం మార్కెట్ కొనసాగుతుందని, దీన్నే ప్రతిరోజు సాయంత్రం కూడా కొనసాగించాలనే చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. ఈ విషయంపై సికింద్రాబాద్‌లోని మోండా మార్కెట్, గుడిమల్కాపూర్ మార్కెట్ అధికారులు, ట్రేడింగ్ వ్యాపారులతో చర్చించారన్నారు. ఈ ప్రాంతంలో రైతులు పండించిన పంటలను రాత్రి సమయంలో హైదరాబాద్‌లోని మార్కెట్‌లలో అమ్ముకొని తిరిగి రావడమనేది అనేక ఇబ్బందులతో కూడుకుందని రైతులు చెప్పినట్లు ఆయన తెలిపారు. రైతులు తాము పండించిన పంటలను సాయంత్రమే చేవెళ్ల మార్కెట్‌లో అమ్ముకోవటం వల్ల వారికి రవాణా ఇబ్బందులు లేకుండా సమయం ఆదా అవుతుందని చెప్పారు. రైతులు వారి వెసులుబాటును బట్టి ఉదయం, సాయంత్రం జరిగే మార్కెట్‌లో కూరగాయలు విక్రయించుకునే వీలు ఉంటుందన్నారు. రైతులు తీసుకొచ్చే కూరగాయలను బట్టి ఉదయం, సాయంత్రం గిరాకి ఉంటుందన్నారు. ఉదయం పూట ఎక్కువగా ఆకుకూరగాయలు, పూలు విక్రయించొచ్చన్నారు. ఇతర కూరగాయల విషయంలో సాయంత్రం మార్కెట్ అనుకులంగా ఉంటుందని తెలిపారు. రైతుల అభిప్రాయాల మేరకు ఈ మార్కెట్‌ను రెండు పూటల ఏర్పాటు చేయాలని ప్రయత్నిస్తున్నట్లు వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పామెన సర్పంచ్ మల్లారెడ్డి, ఎంపీటీసీ సత్యనారాయణచారి, మార్కెట్ డైరెక్టర్ తెలుగు వెంకటేశ్, ఎర్ర గోపాల్, గ్రామ రైతులు పాల్గొన్నారు.

బస్ షెల్టర్లేవీ..?



అమ్డాపూర్ చౌరస్తాలో రోడ్లపై నిలబడిన విద్యార్థులు, ప్రయాణికులు

రోడ్డుపైనే గంటల తరబడి ఎదురుచూపు

- ప్రయాణికులకు తప్పని తిప్పలు
- పట్టించుకోని ఉన్నతాధికారులు

మొయినాబాద్‌రూరల్: బస్టాప్‌ల్లో బస్ షెల్టర్లు లేక పోవడంతో ప్రయాణికులు ఎండనకా వాననకా గంటల తడబడి నిలబడాల్సి వస్తుందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కూర్చొడానికి కుర్చీ లేదు. నిలబడదామంటే నీడ ఉండదు. ఎండకు, వానకు బస్సు షెల్టర్లు లేక ఇబ్బందులు పడాల్సిన దుస్థితి ప్రయాణికులకు నెలకొంది. హైదరాబాద్-బీజాపూర్ ప్రధాన రహదారిలో పోలీస్ అకాడమీ అప్పా మొదలుకొని తోల్‌కట్ట వరకు బస్ షెల్టర్లే కానరావు. దీంతో అటు జంట నగరాలకు, ఇటు ఆయా ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు గంటల తరబడి నిల్చొని ఇబ్బందులు పడుతున్నారు. అజీజ్‌నగర్, హిమాయత్‌నగర్, మొయినాబాద్, కనకమామిడి, కేతిరెడ్డిపల్లిలో, తోల్‌కట్ట ఆయా గ్రామాల చౌరస్తాల్లో షెల్టర్లు లేక ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. రోడ్లపై గంటల తరబడి నిల్చొనే బస్సుల కోసం ఎదురు చూడాల్సిన దుస్థితి నెలకొందని ప్రయాణికులు, స్థానికులు చెబుతున్నారు. మొయినాబాద్ మండల పరిధిలో అనేక ఇంజనీరింగ్ కళాశాలలు, పలు మెడికల్ కళాశాలలు, డెంటల్ కళాశాలలు, ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు ఎన్నో ఉన్నాయి. జంట నగరాల నుంచి విద్యార్థులు ఉన్నత విద్య కోసం రాకపోకలు చేస్తుంటారు. వారు కూడా బస్సుల కోసం ఎదురుచూసే పరిస్థితి ఉంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి బస్‌షెల్టర్లు ఏర్పాటు చేయాలని స్థానికులు, ప్రయాణికులు కోరుతున్నారు.



అజీజ్‌నగర్ చౌరస్తాలో బస్సుల కోసం ఎదురు చూస్తున్న విద్యార్థులు